క్లుప్తంగా

రేపు ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వివరాలు వెల్లడిస్తున్న రతన్‌సింగ్, పురుషోత్తం

నయీంనగర్: హనుమకొండ సుబేదారి ఆర్ట్స్, సైన్స్ కళాశాల బీఎస్సీ (బీజెడ్‌సీ) 1967 –70వ సంవత్సర పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి నివాసంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సీకేఎం కళాశాల రిటైర్డ్ రీడర్ ఇన్ జువాలజీ ఠాకూర్ రతన్‌సింగ్ తెలిపారు. పూర్వ విద్యార్థులందరూ హాజరై తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు బొడ్రాయి ప్రతిష్ఠాపన సమావేశం

ఖిలా వరంగల్: ఈనెల 21న వరంగల్ లక్ష్మీనగర్‌లోని తారక రామ కల్యాణ మండపం, హనుమాన్ దేవాలయం ఆవరణలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు గోగికార్ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనగర్ గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులు, మహిళా, యువజన సంఘాల నాయకులు తరలిరావాలని ఆయన కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఏఎస్సై

కాజీపేట: రహదారిపై దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను పోలీసుల సహాయంతో బాధితుడికి ఓ ఫొటోగ్రాఫర్ అందించి తన నిజాయితీ చాటుకున్నారు. కాజీపేట పట్టణానికి చెందిన రౌతు కమల్‌కుమార్ అనే ఫొటోగ్రాఫర్.. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఓ సెల్‌ఫోన్ దొరికింది. వెంటనే దాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా, సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్ల ఆధారంగా బాధితుడిని గుర్తించి ఏఎస్సై నర్సయ్య ద్వారా శుక్రవారం అందించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని ఎంపీకి వినతి



హసన్‌పర్తి: హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్‌లో ఇంటర్‌సిటీ, తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇవ్వాలని కార్పొరేటర్ శివకుమార్ కోరారు. ఈమేరకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చినట్లయితే హసన్‌పర్తి, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

పద్మాక్షి దేవాలయంలో కాత్యాయని వ్రతం


వ్రతం ఆచరిస్తున్న యువకులు

హన్మకొండ కల్చరల్: హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శుక్రవారం కాత్యాయని వ్రతం నిర్వహించారు. ఉదయం దేవాలయ అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు కుప్పా సూరావధానులు, శరత్‌చంద్ర ఘనపాఠి, షణ్ముక పద్మనాభ అవధాని.. పద్మాక్షి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, అమ్మవారి సన్నిధిలో వివాహం కాని 25మంది యువతీ, యువకులు పాల్గొని కాత్యాయని వ్రతాన్ని ఆచరించారు. వారికి వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ఏకగ్రీవం కానున్న ఓసిటీ ఎన్నికలు

కాశిబుగ్గ: 19వ డివిజన్ ఓసిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. బరిలో ఉన్న ఎనిమిది మంది అభ్యర్థుల్లో శనివారం ఐదుగురు ఉపసంహరించుకున్నారు. దాంతో అధ్యక్షుడి పదవికి సొల్లేటి శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శికి దొంతుల శోభన్, కోశాధికారి పదవికి తోట కరుణాకర్ మాత్రమే పోటీలో నిలిచారు. బరిలో ఎవరూ లేకపోవడంతో వారే ఏకగ్రీవంగా ఎన్నికకానున్నారు. విజేతలను ఈనెల 21న అధికారికంగా ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ముస్తాబవుతున్న ఆలయాలు

- అయోధ్య రాములోరి ఉత్సవాల సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు
- ఆధ్యాత్మిక కార్యక్రమాల పనుల్లో నిర్వాహకులు నిమగ్నం


విద్యుత్ వెలుగుల్లో శ్వేతార్క ఆలయం


కాజీపేటలోని శివాలయం

కాజీపేట: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవాలను పురస్కరించుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టేందుకు కాజీపేట పట్టణంలోని పలు ఆలయాల కమిటీలు సన్నాహాలు చేపడుతున్నాయి. ఇప్పటికే పలు ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించారు. సీతారాముల చిత్రపటాల కటౌట్లను ఏర్పాటు చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం, పంచముఖ ఆంజనేయ స్వామి, రైల్వే దేవాలయాల సముదాయం, అయ్యప్ప స్వామి ఆలయం, అభయాంజనేయ స్వామి దేవాలయం, ప్రశాంత్‌నగర్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి, గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో హోమాలు, సీతారాముల కల్యాణ మహోత్సవాలు, భజనలు, అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అయోధ్య నగరంలో ఈనెల 22న జరగనున్న ఉత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎల్‌ఈడీ తెరలను పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఉత్తర్వులకనుగుణంగా వేతనాలు పెంచాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కేయూ క్యాంపస్: కలెక్టర్ ఉత్తర్వులకు అనుగుణంగా కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతన ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలకు 50శాతం అదనంగా పెంచి చేసి చెల్లించాలని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం దినసరి వేతన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శాగంటి శ్రీనివాస్, కేయూ టెంపరరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ విష్ణువర్ధన్, కేయూ దినసరి వేతన ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ దయాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, వేతనాల విధివిధానాల కమిటీ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డిని శుక్రవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు డాక్టర్ సుదయ్య, గోపి, యాదగిరి, రమణారెడ్డి, లంప్సమ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ టీమ్ ఏర్పాటు



మడికొండ: మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యాంటీ ర్యాగింగ్ టీమ్‌ను మడికొండ ఎస్సై రాజబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువుపై దృష్టి సారించి ముందుకు సాగాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, ఎస్సై జక్కుల రాజబాబు, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీని కలిసిన స్టడీ సర్కిల్ డైరెక్టర్

కేయూ క్యాంపస్: రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్ శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

మర్కజీ జంక్షన్‌లో సిగ్నల్స్‌కు ప్రతిపాదనలు

సాక్షి స్పందన

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ జీడబ్ల్యూఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. 'మర్కజీ జంక్షన్‌లో బారికేడ్లు' అనే పేరుతో సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోకి అంబులెన్సులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని పోలీస్ కమిషనర్‌కు ఆస్పత్రి ఉన్నతాధికారులు వినతిపత్రం అందజేశారని, ఈక్రమంలో తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మర్కజీ సెంటర్‌లో డివైడర్లను ఏర్పాటు చేసి జీఎంహెచ్ ఎదుట అంబులెన్సులు వెళ్లేందుకు వీలుగా డివైడర్లు తెరిచినట్లు వివరించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా, ప్రమాదాలను నియంత్రించడం కోసం మర్కజీ సెంటర్‌తో పాటు అమృత టాకీస్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

దామోదర నర్సింహకు సన్మానం

కేయూ క్యాంపస్: వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఈనెల 18న హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ దయాకర్ తెలిపారు. పార్టీ విధేయులైన వారికే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఇచ్చి గెలుపునకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి


సమావేశంలో పాల్గొన్న వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులందరు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కోసం పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని, అందుకోసం ఆధార్‌కార్డు, డిగ్రీ మెమో, పాస్‌ఫొటోను జత చేయాలని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు నమోదుకు గడువు ఉందని చెప్పారు. 2021, అక్టోబర్ 31వ తేదీ లోపు డిగ్రీ పూర్తయిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, కార్పొరేటర్ ఎలకంటి రాములు, బీఆర్‌ఎస్ నాయకులు పులి రజనీకాంత్, మహ్మద్ నయీమొద్దీన్, జానకి రాములు, సదాంద్, సదానందం, శ్రీధర్, శ్రీకాంత్, పరశురాములు, వేణు, భీమ్‌రాజ్, వెంకన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



మాట్లాడుతున్న డీఈఓ అబ్దుల్‌హై


పరీక్ష సామగ్రి అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

హసన్‌పర్తి: నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని హనుమకొండ విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై సూచించారు. హసన్‌పర్తి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బిగ్ హెల్ప్ ఫౌండేషన్ చేపడుతున్న సేవలను అభినందించారు. బిగ్‌హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ ఎం.సరోజిని మాట్లాడుతూ పది మంది నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. వారి చదువు బాధ్యత బిగ్ హెల్ప్ ఫౌండేషన్ భరిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ షేక్ చాంద్‌పాషా, ఎంఈఓ రామకృష్ణరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

హసన్‌పర్తి మండలం ముచ్చర్లలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. చల్లా పూలమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతయ ర్యాంకులు సాధించిన వారికి బహుమతులు అందించనున్నట్లు వివరించారు. అలాగే, స్టడీ మెటిరీయల్ అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో చిర్ర రాజేష్, కన్నబోయిన రాజు, చిర్ర శ్రవణ్, మట్టెడ అనిల్, సతీష్‌చారి, సంతోష్, ప్రధానోపాధ్యాయుడు రంగనాథ్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుతో తీవ్ర ఇక్కట్లు


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న నాయకులు

మడికొండ: మడికొండ శివారులోని డంపింగ్ యార్డును మాజీ మంత్రి గుండె విజయరామరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వెలువడే విషతుల్యమైన పొగతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలని సూచించారు. అలాగే, శాస్త్రీయ పద్ధతిలో చెత్తను ఖననం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొనగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, ఎలగొండ శివ, బైరపాక వెంకటేష్, గడ్డం కిరణ్, చట్ల అజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు


మామునూరు: విరాళం అందజేస్తున్న రాజేంద్రన్


కరీమాబాద్: ప్రార్థనలో మురళీధర్‌రావు

మామునూరు: వరంగల్ సత్యసాయినగర్‌లోని పోచమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారి రమణాచార్యులు, 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో పోచమ్మకు అభిషేకాలు, అర్చనలు, విశేషమైన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి ఆలయాన్ని శుభ్రం చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సరస్వతి విశ్వకీర్తి జన్మదినం సందర్భంగా ఆలయాభివృద్ధికి రూ.10,016లు భక్తుడు పుల్లూరి రాజేంద్రన్ విరాళంగా అందజేశారు. రాంబాబు, శ్రీనివాస్‌గుప్తా, తరగల శ్రీధర్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

ఉర్సు దర్గాలో ప్రార్థనలు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ దర్గాలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈమేరకు త్వరలో జరగనున్న మాషుక్ రబ్బాని ఉర్సు సందల్ ఉత్సవాల గురించి దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా, ఉబేద్ బాబాతో చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్ పాల్గొన్నారు.

రేపు టీజేఎస్ రాష్ట్ర సదస్సు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీజేఎస్ నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్ర విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్షను నిరసిస్తూ తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో చేపట్టిన రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చిల్లా రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఈమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సదస్సు వాల్‌పోస్టర్లను బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా, ఉద్యోగుల విభజన, పెండింగ్‌లో ఉన్న రాష్ట్రస్థాయి సంస్థలు, ఆస్తుల విభజన, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. న్యాయమైన విభజన హామీ సాధనకు చేపట్టిన రాష్ట్ర సదస్సుకు మేధావులు, ఉద్యోగులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాధాకిషన్, బండారి ప్రభాకర్, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సృజన, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సఖి కౌన్సెలర్ విజయలక్ష్మి

కాజీపేట అర్బన్: మహిళలు తమ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ సోషల్ కౌన్సెలర్ విజయలక్ష్మి సూచించారు. 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సఖి సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, స్త్రీ, శిశు సంక్షేమ సౌజన్యంతో బాధిత మహిళలు, బాలికలు అండగా సఖి సెంటర్ సేవలందిస్తోందని వివరించారు. ఆపదలోని మహిళలకు తాత్కాలిక వసతి, వైద్య, పోలీస్ సేవలతో పాటు కౌన్సెలింగ్ అందజేస్తున్నట్లు చెప్పారు. బాధితులు 181, 0870 – 2452112 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది హరిత, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కేయూ క్యాంపస్: వరంగల్ ఎయిడ్స్ కంట్రోల్ (నియంత్రణ) మండలి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీల్లో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు పాల్గొని మొదటి బహుమతి గెలుచుకున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈమేరకు వారిని కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ నివేదికకు కాలయాపన ఎందుకు?


మాట్లాడుతున్న శివకుమార్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలుతో యూనివర్సిటీ అధికారులు వేసిన విచారణ కమిటీ నివేదిక వెల్లడిపై ఎందుకు కాలయాపన చేస్తున్నారని బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్ ప్రశ్నించారు. కాకతీయ యూనివర్సిటీలో బీఎస్‌ఎఫ్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ కమిటీ వేసి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు నివేదిక బయటికి రాకపోవటానికి కారణాలు ఏమిటని అన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాలలోని ఎస్‌ఎఫ్‌సీ కోర్సులు, డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజులకు సంబంధించిన వివరాలు బహిర్గతం చేయాలని సూచించారు. సమావేశంలో బీఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు అజిత్, బాధ్యులు వినోద్, రఘువరన్, శ్రీకాంత్, విశాల్, భూపతి పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సౌజన్య, తదితరులు


దివ్యాంగుల క్యాలెండర్ ఆవిష్కరిస్తూ..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని మైనార్టీ గురుకుల బాయ్స్ పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య, సంఘం బాధ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా వింగ్ అధ్యక్షుడు భిక్షపతి, కోశాధికారి షకీల్ అహ్మద్, స్కూల్ కన్వీనర్ లక్ష్మీనారాయణ, సుధారాణి, రఫియాసుల్తానా, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం క్యాలెండర్..

హసన్‌పర్తి: దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను హసన్‌పర్తి ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాంకిషన్‌రాజు, ఎల్కతుర్తి మండల విద్యాశాఖ అధికారి రవీందర్, దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్లా మహేందర్, రాష్ట్ర కార్యదర్శి నున్న నరసమ్మ, జిల్లా కోశాధికారి పల్లపురెడ్డి వాసుదేవారెడ్డి, ఉపాధ్యక్షుడు సోమన్న, కార్యదర్శులు వి.నారాయణరెడ్డి, పెండ్యాల రాధిక, బొప్పి ఉమారాణి, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తనలో మార్పు రాకుంటే పీడీ యాక్ట్


కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ బారి

హసన్‌పర్తి: ప్రవర్తనలో మంచి మార్పు రాకుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని రౌడీషీటర్లను సెంట్రల్ డీసీపీ ఎంఏ.బారి హెచ్చరించారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్ల నడవడికపై స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ తొలగిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పాత కేసుల బెయిల్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా, లారీ ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్న అన్నాసాగరానికి చెందిన రౌడీషీటర్ దేవేందర్‌రెడ్డిపై ఉన్న రౌడీషీట్‌ను తొలగిస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతర పనుల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రిజ్వాన్ బాషా

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని అమ్మవారిపేట సమ్మక్క – సారలమ్మ జాతర పనులను బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం పరిశీలించారు. జాతర పనులను త్వరగా పూర్తి చేయాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.